

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



జీవన్ సే భరీ, తెరీ ఆంఖే

మజ్బూర్ కరే, జీనేకే లియే

సాగర్ భీ తరస్ తే రహతే హై

తెరె రూప్ క రస్ పీనేకే లియే

1970లో విడుదలయిన 'సఫర్' సినిమాలోని మరుపురాని మధురమైన పాట ఇది. ఇందీవర్ రచించగా కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ సంగీతం రూపొందించిన ఈ పాటను తన హృదయగీతంగా మలచుకుని తన స్వరంతో కిషోర్‌కుమార్ ప్రాణం పోసిన మధుర రసప్రవాహం ఈ గీతం.

హిందీ సినీ ప్రపంచంలో 1970 ఒక నిర్ణయాత్మకమైన సంవత్సరం. హిందీ సినీ సంగీత స్వరూపం సంపూర్ణంగా రూపాంతరం చెందటం వేగవంతమైన  సంవత్సరం. హిందీ సినీ సంగీత స్వర్ణయుగం అంతం అవటం ఆరంభమైన సంవత్సరం. సినీ సంగీత స్వర్ణయుగంపై తెరతీసిన మొదటి తరం సంగీత దర్శకులు అప్పటికే తెరమరుగయిపోయారు. స్వర్ణయుగానికి ఊపునిచ్చిన సంగీత దర్శకులు శంకర్ జైకిషన్ వంటివారు నెమ్మదిగా వెనుకబడటం స్పష్టమైన సంవత్సరం. స్వర్ణయుగానికి తన స్వరంతో వన్నెలద్దిన లత తన గాన సంవిధానాన్ని పునర్నిర్వచించుకుని నూతన పంథాను ఏర్పాటు చేసుకున్న సంవత్సరం. మకుటంలేని మహారాజులా హిందీ సినీ సంగీత ప్రపంచాన్ని ఏలుతున్న మహమ్మద్ రఫీకు కిషోర్‌కుమార్ రూపంలో ఎదురు దెబ్బ తగిలిన సంవత్సరం. యువ సంగీత దర్శకులు కళ్యాణ్జీ ఆనంద్‌జీ, లక్ష్మీకాంత్ ప్యారేలాల్, ఆర్డీబర్మన్ వంటివారు హిందీ సినీ సంగీత పరిశ్రమపై తమ పట్టును గట్టిగా బిగించిన సంవత్సరం. ఆ దశాబ్దంలో సినీసంగీతంలో సంభవించిన పలు పెనుమార్పులకు దర్పణం పడుతుంది ఈపాట..

కళ్యాణ్‌జీ ఆనంద్‌జీలు 1959లోనే జంట సంగీత దర్శకులుగా ఏర్పడినా, శంకర్ జై కిషన్ నీడనుంచి బయటకు వచ్చి తమదైన సంగీత సృజన సంవిధానంతో సినీ సంగీత ప్రపంచంలో గుర్తింపు పొందటం మాత్రం 1965నుంచే ఆరంభమయింది. 1970 వ సంవత్సరం వచ్చేసరికి లక్ష్మీప్యారేలాల్, ఆర్డీబర్మన్‌లతో కలసి కళ్యాణ్‌జీ ఆనంద్‌జీలు నూతన సినీ సంగీత త్రిమూర్తులుగా ఎదిగారు. 1970లో విడుదలయిన సఫర్, సచ్చాఝూటా, జానీ మేరా నాం, యాద్‌గార్, పూరబ్ ఔర్ పశ్చిం, మేరే హం సఫర్, గీత్, గోపి, ఘర్ ఘర్ కీ కహానీ, వంటి సినిమాలలోని పాటలు కళ్యాణ్‌జీ ఆనంద్‌జీలను అగ్రశ్రేణి సంగీత దర్శకులుగా నిలిపాయి. అందులో సఫర్‌లోని రెండు మధురమైన కిషోర్ కుమార్ గీతాలు 1970 దశకాన్ని కిషోర్ కుమార్ యుగంగా నిలపటంలో ఎంతగానో తోడ్పడ్డాయి. కిషోర్ కుమార్ 1970 దశకంలో మహమ్మద్ రఫీని దాటి మకుటంలేని మహారాజులా సంగీత ప్రపంచాన్ని శాసించటంలో తోడ్పడిన పాటలలో అగ్రస్థానంలో ఉంటుంది 'తెరీ ఆంఖే' పాట. అంతేకాదు, కిషోర్ కుమార్ స్వరం రాజేష్ ఖన్నా స్వరంలా స్థిరపడటంతో తోడ్పడిన పాటలలోనూ అగ్రస్థాయిలో ఉంటుందీ పాట.

1969లో ఆరాధనతో గాయకుడిగా తనదైన ప్రత్యేక అస్తిత్వం సాధించాడు కిషోర్ కుమార్. అంతవరకూ నటుడిగా కాక గాయకుడిగా తెరపైకి వచ్చాడు. తన పాటలు, దేవ్ ఆనంద్ పాటలు మాత్రమే పాడే కిషోర్ కుమార్ ఇతర నటులకు పాటలు పాడే నేపథ్య గాయకుడిగా రూపాంతరం చెందాడు. సూపర్‌స్టార్ రాజేష్ ఖన్నా స్వరంగా ఎదిగాడు. మహమ్మద్ రఫీ తేనెలూరే స్వరానికి అలవాటుపడ్డ శ్రోతలను తన గంభీరమైన, శక్తివంతమైన స్వరంతో ఉలిక్కిపడేట్టు చేసి ఆకట్టుకున్నాడు.

ఈ గేయ రచయిత ఇందీవర్ అసలు పేరు శ్యాంలాల్ బాబూరాయ్. 1957లోనే సినీరంగ ప్రవేశించినా 1965 తరువాత కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ బాణీలకు పాటలు రాస్తూ గుర్తింపు పొందాడు. హిమాలయ్ కీ గోదేమే, సరస్వతీ చంద్ర వంటి సినిమాలలోని అత్యద్భుతమైన పాటలకు కొనసాగింపుగా, సఫర్ సినిమాలోనూ సాహిత్యపరంగా అత్యుత్తమ స్థాయి గీతాలను రచించాడు ఇందీవర్.

ఇందీవర్ రచనాశైలి, అనేక ఇతర గేయ రచయితలకన్నా భిన్నమైనది. హిందీ సినిమా పాటలలో 'ఉర్దూ' పదాలను అధికంగా వాడతారు. కానీ కవి ప్రదీప్, భరత్ వ్యాస్ వంటివారు వీలయినంత వరకూ ఉర్దూ పదాలను, పర్షియన్ ఉపమానాలను వాడకుండా శుద్ధ హిందీలో, సంపూర్ణంగా భారతీయ ప్రతీకలతో గేయాలను సృజించేవారి సరసన చేరతాడు ఇందీవర్. ఇందీవర్, కవి ప్రదీప్, భరత్‌వ్యాస్‌లు అప్పుడు ఉర్దూ పదాలను వాడినా, అవి సామాన్య ప్రజలకు అతి సులభంగా అర్ధమయి, ప్రచారంలో ఉన్న పదాలనే వాడతారు.ఒకరకంగా చెప్పాలంటే నిత్య జీవితంలో వాడుతూండటం

వల్లా ఆయా పదాలు ఉర్దూ పదాలన్న స్పృహ కోల్పోయిన పదాలను వాడతారు. అంతే తప్ప కఠినమైన ప్రచారంలో లేని ఉర్దూ పదాలను వాడరు.

ఇందీవర్ తొలి పాట మల్‌హార్ సినిమాలోనిది

బడే అర్మానోంసే రఖాహై బలం తేరె కసం

ప్యార్‌కీ దునియమే యే పహల కదం

ఈ పాటలో ఉర్దూ పదాలున్నా సులభంగా అర్థమైపోతుంది.

చందన్ స బదన్, చంచల్ చిత్‌వన్

ధీరే సె తెరా యె ముస్కానా

ముఝె దోష్ న దేనా జగ్‌వాలో

హోజావు అగర్ మై దీవానా

శుద్ధ హింది పదాల సరసన సులభంగా అర్థమయ్యి, అందరూ వాడే 'ముస్కాన్' వంటి పదాలనూ శుద్ధ హిందీ పదాలు అనిపించే రీతిలో వాడాడు ఇందీవర్. ఇది శైలేంద్ర గేయ రచన శైలిని అనుసరిస్తూ తనదైన ప్రత్యేక గేయ రచనా సంవిధానాన్ని ఇందీవర్ ఏర్పరచుకోవటాన్ని సూచిస్తుంది. శైలేంద్ర మరణించేందుకు కొద్ది సంవత్సరాలముందే ఇందీవర్‌కు గుర్తింపు రావటం గమనార్హం.

చాంద్ సీ మహబూబా హో మేరే కబ్

ఐసా మైనే సోచాథా

హా తుమ్ బిల్‌కుల్ వైసీహో

జైసా మైనే సోచాథా

మహబూబా, చాంద్, బిల్‌కుల్ వంటి ఉర్దూ పదాలున్నా పాట ఉర్దూ పాటగా అనిపించదు. భావం సులభంగా బోధపడుతుంది. సరళతరమైన గేయరచన పద్ధతి ఇందీవర్‌ది. అంటే, నిత్యజీవితంలో ఎంతగా భాగమయిపోయే ఉర్దూపదాలు వాడతాడంటే అవి ఉర్దూ పదాలుగా అనిపించవు. కానీ ఆయన వాడే హిందీ పదాలు మాత్రం శుద్ధం, పవిత్రం, అద్భుతం అయినవి.

ప్రేయసిని వర్ణించే పాట ఇది.

నాయకుడు చిత్రకారుడు. తన భావాలను రంగులలో ముంచి కుంచెద్వారా కేన్వాసుపై వ్యక్తపరుస్తాడు నాయకుడు. కాబట్టి, నాయికను ఒక చిత్రకారుడి దృష్టిలో వ్యక్తపరచాలి. ఎలాగయితే అక్షరాలద్వారా రచయిత వ్యక్తులకు ప్రాణం పోసి సజీవంగా వ్యక్తులను తన కళలో నిలుపుతాడో, అలాగే, చిత్రకారుడు నిర్జీవమైన గీతలు, రంగుల ద్వారా సజీవమైన మూర్తిని తన చిత్రలేఖనం ద్వారా ప్రదర్శించాల్సి ఉంటుంది.

ఒక వ్యక్తి జీవం, చైతన్యం అతని నయనాల ద్వారా ప్రకటితమవుతుంది. కళ్లు చూస్తే చాలు వ్యక్తి ఆత్మను గ్రహించవచ్చు. చిత్రకారులు కూడా ఒక వ్యక్తిలో ప్రధానంగా దర్శించేది ప్రదర్శించేది నయనాలనే. కళ ప్రధానంగా భావనలు ఆలోచనలు, సందేశాలను ప్రదర్శిస్తుంది. అందుకే కళా ప్రదర్శనలో 'కళ్లు' ప్రధాన పాత్ర వహిస్తాయి. కళ్లల్లో కనబడే భావాలు ఒక 'కళ' నాణ్యతను నిర్దేశిస్తాయి. ఆ కళ ప్రదర్శించే భావనలను ప్రతిబింబిస్తాయి.

మోనాలిసా పెయింటింగ్ ఈనాటికీ కళా ప్రపంచంలో 'మోనాలిసా' కళ్లల్లో ప్రదర్శితమౌతున్న భావనల ఆధారంగా చర్చల్లో ఉంది. పెదవులపై ఉండే నవ్వు కన్నా కళ్లల్లోని భావం గురించే అధిక శాతం చర్చలు సాగుతాయి. ఆ 'కళ'కు ఒక గుహ్యత్వాన్ని, మార్మికతను ఆపాదిస్తున్నవి కళ్లే. ప్రాచీన ఈజిప్టుకు చెందిన 'The Eye of Horus'కూడా కళ్లల్లోని భావనల వల్ల ప్రాచుర్యం పొందింది. రెంబ్రాంట్ చిత్రించిన 'Self portarit with two circles' కూడా కళ్లలో ప్రతిబింబిస్తున్న ఆత్మ గురించి విభిన్నమైన ఆలోచనలను రేకెత్తించటం వల్ల ప్రాచుర్యం పొందింది 'The Parosture of Memory' అన్న సాల్వడార్ డాలీ పెయింటింగ్ సైతం 'కళ్ల' వల్ల ప్రాధాన్యం పొందినది. జోహాన్నస్ వెర్మియర్ పెయింటింగ్ 'The Girl with the pearl ear ring' కూడా ఆమె చెవి రింగుపై ప్రతిఫలించే సూర్యకాంతివల్ల ఎంత ప్రాచుర్యం పొందిందో, ఆమె కళ్లు ప్రతిబింబించే భావాల వల్ల కూడా అంతే చర్చనీయాంశమయింది. 'కళ్లల్లో భావం' వల్ల అమరమైన కళాఖండాలకు, చిత్రకారులకు అనేకానేక ఉదాహరణలు ఇవ్వవచ్చు. దీనివల్ల స్పష్టమయ్యేదేమిటంటే, కళాకారులు ప్రథమంగా, ప్రధానంగా 'కళ్ల' ఆధారంగా ఆకర్షితులవుతారన్నది.

అందుకే ఇందీవర్ పాటను ప్రారంభించటం కూడా 'జీవన్ సే భరీ తెరీ ఆంఖే మజ్బూర్ కర్ జీనేకే లియే ' అంటూ ఆరంభిస్తాడు. జీవితం నిండిన నీ కళ్లు బ్రతికేందుకు నన్ను నిస్సహాయుడిని చేస్తున్నాయి అన్న సామాన్యార్థం వస్తుంది ఈ వాక్యాలలో. కానీ తరచి చూస్తే, పదాల వాడకం గమనిస్తే ఇందీవర్ గొప్పతనం తెలుస్తుంది. ఈ పాదంలో 'మజ్‌బూర్ ' అన్నది ఉర్దూపదం. జీనా కూడా ఉర్దూ పదం.

'మజ్బూర్' అంటే 'నిస్సహాయత' అన్న అర్థం వస్తుంది. ఎవరో వత్తిడి చేయటంవల్ల నిస్సహాయుడవటం అన్నమాట.

'జీవన్ సే భరీ' జీవితం నిత్యచైతన్య శీలి, చైతన్యం నిండి జీవంతో తొణికిసలాడుతున్న ఆమె నయనాలు, ఆ కళాకారుడికి జీవితం పట్ల ఆశను కలిగించి, తప్పనిసరిగా బ్రతికేందుకు ప్రోత్సహిస్తున్నాయన్నమాట.

కళాకారులు సాధారణంగా నిరాశ, నిస్పృహల పట్ల ఆకర్షితులయ్యే విషాద ప్రియులై ఉంటారు. జీవితాన్ని ఎలా విషాదమయం చేసుకోవాలో దుర్భరం చేసుకుని రోదించాలో కళాకారులకు తెలిసినంతగా దురదృష్టవంతులకు కూడా తెలియదు. ఇతరులకు హాస్యంగా, తేలికగా అనిపించే విషయాలు కళాకారులకు జీవన్మరణ సమస్యల్లా అనిపిస్తాయి. జీవితం పట్ల విరక్తి కలిగి, ప్రతి చిన్న విషయానికీ జీవితాన్ని త్రోసిరాజని, తృణీకరించాలని తపన పడే కళాకారుడిని కూడా ఆమె కళ్లల్లో తొణికిసలాడే చైతన్యం, జీవం నిండిన ఆమె కళ్లు, బ్రతకకుండా ఉండలేని వాడినిగా చేస్తున్నాయి. అంటే, ఆమె కళ్లు అతడిని జీవించేందుకు ప్రేరణనిస్తున్నాయి అన్నమాట. ఆమె కళ్ళల్లోని జీవం జీవించాలన్న తపన అతనిలో రగిలిస్తోందన్నమాట. జీవితాన్ని ప్రేమించేట్టు చేస్తుందన్నమాట. అతడి జీవితంలోని నిరాశ నిస్పృహలను పారద్రోలి అతడిలో జీవించాలన్న ఆశను చిగురింపచేస్తోంది. జీవితేచ్ఛను రగిలిస్తోంది.

కళాకారుడికి 'జీవం ' అతడి కళాసృజన. కళను సృష్టిస్తున్నంతకాలమే అతను సజీవంగా ఉన్నట్టు. కళను సృజించలేని కళాకారుడు మృతప్రాయుడు. అతడిని జీవించేట్టు చేస్తున్నాయి ఆమె కళ్లు అంటే, అతడు కళను సృజించకుండా ఉండలేనట్టు, సృజించేట్టు నిస్సహాయుడిగా చేస్తున్నాయన్నమాట ఆమె కళ్లు. అందుకే పాట ఆరంభిస్తూ జీవన్ సే భరీ అన్నప్పుడు తెరపై కుంచె మాత్రమే కనిపిస్తుంది. ఆ తరువాత నాయకుడు కనిపిస్తాడు. తరువాత కేన్వాసు నిండా పలు భావాలను వ్యక్తపరచే ఆమె కళ్ళు మాత్రమే కనిపిస్తాయి.అంటే, పైకి పాట నాయిక కళ్ళగురించి, ఆమె అందం గురించి అనిపిస్తున్నా, అంతర్గతంగా, ఒక కళాకారుడికి కళా సృజనలో ఆమె ఇచ్చే ప్రేరణ స్వరూపాన్ని వివరిస్తున్నదన్న మాట ఈ పాట.

**జీవన్ సే భరీ తెరీ ఆంఖే మజ్‌బూర్ కరే జీనేకెలియే**

సాగర్ భీ తరస్తే రహతే హై

తెరె రూప్ క రస్ పీనే కే లియే, జీనేకే లియే..

ఇది పాట పల్లవి.

ఆమె రూప రసం అంటే అమృతం కురిపించే ఆమె రూపరసాన్ని గ్రోలాలని సాగరం కూడా తపన పడుతుంది. జీవించాలని సాగరం కూడా తపిస్తోంది. 'రూప్ క రస్' అన్నది చక్కని పదప్రయోగం. 'రసం' అంటే 'సారం'. నిమ్మకాయ రసం అంటే నిమ్మకాయను పిండి దానిలోని సారం గ్రహించటం. ఇక్కడ 'రూప్ కా రస్ ' అంటున్నాడు ఇందీవర్. 'రూపం' అంటే శరీర సౌష్టవం కాదు. అమృతం చిలికించే ఆమె అందం. ఆ అమృతాన్ని గ్రోలాలని తపిస్తున్నది సముద్రం. రసాస్వాదనకు సహృదయం ఆవశ్యకం. ఉపనిషత్తుల ప్రకారం 'రసం' అంటే సారం, చైతన్యం. ఆమె రూపరసం గ్రోలేందుకు సముద్రం తపన పడుతున్నది అనటం అత్యద్భుతమైన ఆధ్యాత్మిక భావానికి అతి సుందర కవితాత్మక వ్యక్తీకరణ. సముద్రం అనంతానికి ప్రతీక. ఆమె అందం రససార అమృతాల్ని గ్రోలటం ద్వారా తన దాహాన్ని తీర్చుకుని జీవించాలని సముద్రం తపన పడుతోంది. నాయకుడు కళాకారుడూ, చిత్రకారుడూ. అందాన్ని గీతల్లో, రంగుల్లో బంధించి ప్రదర్శిస్తాడు. గీతలు కానీ రంగులు కానీ జీవం లేనివి. నిర్జీవమైన ఆ గీతలు, రంగుల కలయిక ద్వారా సజీవమైన ఆమె రూపాన్ని అతడు తన చిత్రంలో ప్రదర్శించాలి. ఆమె రూపరసాన్ని అంటే రూపసారాన్ని తన కుంచెద్వారా రంగుల్లో, గీతల్లో బంధించి కేన్వాస్‌పై సజీవ మూర్తిని ప్రతిష్టించాలి. ఇది అనంతమైన సృజనాత్మకత తపన. ఈ సృజనాత్మక తపనను సాగర తపనపై ఆరోపించి, తన సృజనాత్మక ఆవేశాన్నీ, ఆరాటాన్నీ ఈ గేయంలో ప్రదర్శించాడు కవి ఇందీవర్. చైతన్యవంతమైన జీవంతో తొణికిసలాడే ఆమె కళ్లను, ఆమె రూపరసాన్ని సజీవంగా ప్రదర్శించే సృజనాత్మక అభినివేశం వల్ల తన కళ సార్ధకం అవ్వాలని, తాను అమరుడనవ్వాలన్న ఆకాంక్షను పల్లవిలో వ్యక్తపరచాడు ఇందీవర్.

మానసిక సిద్ధాంతం ప్రకారం ఏ కళ సృష్టి అయినా నేపథ్యంలో చిరంజీవిగా నిలవాలన్న వ్యక్తి ఉపచేతనలో నిద్రాణంగా ఉన్న ఆకాంక్ష ఉంటుంది. ఆమె కళ్లు అతడిని సృజనకు ప్రేరేపిస్తున్నాయి. ఆ సృజన ఆమె రూపరసాన్ని, అమృతాన్ని గ్రోలి అమరమైన చిత్రలేఖనను సృజించాలని తపన పడుతోంది. తద్వారా తాను 'చిరంజీవి' అవుతాడు. 'జీనే కే లియే మజ్‌బూర్' కరే అన్నదాన్ని సామాన్యార్ధంలో తీసుకుంటే జీవితం పట్ల ఆశ కలిగిస్తోందన్న అర్ధం వస్తుంది. లోతుగా ఆలోచించి, విచారిస్తే, తన కళద్వారా కళాకారుడు 'చిరంజీవి' గా నిలచేందుకు ప్రేరణనిస్తున్నది. 'చిరంజీవి' గా జీవించకుండా ఉండలేని నిస్సహాయుడిని చేస్తుంది. ఇక్కడ హిందీ సినీ గేయ రచయితలపై హిందీ సాంప్రదాయిక సాహిత్య

ప్రభావపు మెరుపులను దర్శించే వీలు కలుగుతుంది. భారతీయ కావ్యాలలో కళ్లను అమృతకలశాలుగా, జ్యోతిని వొలకపోసే కలశాలుగా వర్ణించారు. పర్షియన్ సాహిత్య ప్రభావంతో ఎదిగిన ఉర్దూ సాహిత్యంలో కళ్ళను మత్తు గొలిపే మధు కలశాలుగా వర్ణించారు.

'ఛల్కే తెరి ఆంఖోంసే షరాబ్ ఔర్ జ్యాదా' అన్నాడు హస్రత్ జైపురి. 'తేరి ఆంఖోనె పిలాదీ తో మై పీతా హి గయా' అన్నాడు కైఫీ ఆజ్మీ. 'ఆంఖే హై జైసె మై కె ప్యాలే భరేహువే' అన్నాడు షకీల్ బదాయుని. 'ఛల్కాయే జాం, ఆయియే, ఆప్‌కే ఆంఖోంకె నాం ' అన్నాడు మజ్రూహ్ సుల్తాన్‌పురి. ఇలా ఉర్దూ సాహిత్య ప్రభావం ఉన్న వారంతా కళ్లను మధువుతోనూ, మధు కలశాలతోనూ పోల్చారు. కానీ భారతీయ సంప్రదాయ సాహిత్యంలో కళను మత్తు పదార్ధాలతో పోల్చటం అరుదు.

'దోనైనా మత్వారే తిహారే హం పర్ జులం కరే' అని 1944లో కుందన్‌లాల్ సైగల్ 'మేరి బహెన్' సినిమాలో పాడాడు. పాట రాసింది పండిత్ భూషణ్. అందమైన ఆమె కళ్లు అతనిపై జులుం చలాయిస్తున్నాయట.

**తన్‌తన్‌కె చలాయే తీర్**

**నస్‌నస్ మె ఉఠాయే పీర్**

**మధ్భరే రసీలే నిఠోర్ బడే**

**న డరే న ధర్ ధరే.**

ఆ కళ్లు బాణాలు వేస్తూంటే నరనరాన రక్తం పరుగులిడుతోంది. తేనెలూరే ఆమె కళ్లు నన్ను ఉత్సాహవంతుడిని ధైర్యవంతుడిని చేస్తున్నాయి.

ఆమె కళ్ల వర్ణనలో 'మధు ' (తేనె) ప్రసక్తి ఉంది. కానీ 'మధువు' ప్రసక్తిలేదు.

**గోరీ నైన్ తుమ్హారే క్యా కహనే.**

**రస్ కే భరీ గోరీ నైన్ తుమ్హారే క్యా కహెనే**

'పూర్ణిమా సినిమాలో ముకేష్ పాడిన భరత్ వ్యాస్ గీతం ఇది. 'రసం నిండిన ఆమె కళ్లు' అంటే 'అమృతం నిండిన కళ్లు' లేక 'జీవంతో తొణికిసలాడే కళ్లు' తప్ప 'మధురసం' కాదు. ఈ పాటలోనే ఆమె కళ్లను 'నీలకమలాలతో' పోలుస్తాడు.

**యే ఝీల్ సె నీలే ఆంఖే**

**కోయి రాజ్ హై ఇన్‌మే గెహరా**

'కశ్మీర్ కీ కలీ ' సినిమాలో ఎస్ హెచ్ బిహారీ నాయిక కళ్లను నీలి సరస్సుతో పోలుస్తాడు. అంతేకాదు ఆమె కళల్లో లోతైన రహస్యాలున్నాయంటాడు.

కళ్లను కమలాలతో, చేపలతో, ఆకాశంలోని నీలిమతో పోల్చటం సాంప్రదాయం. 'జీవన్ సే భరీ ఆంఖే' అనటం వెనుక హిందీ సాంప్రదాయ సాహిత్య ప్రభావం అందుకే కనిపిస్తుంది.

**తస్వీర్ బనాయే క్యా కోయీ**

**క్యా కోయీ లిఖే తుఝ్ పే  కవితా**

**రంగోం ఛందోంమె సమాయేగీ**

**కిస్ తర్హా సే  ఇత్‌నీ సుందరతా**

**ఎక్ ధడ్ కన్ హై తూ దిల్ కే లియే**

**ఎక్ జాన్ హై తూ జీనే కే లియే.**

అతి సులభంగా అర్ధమయ్యే చరణం ఇది. కానీ పదాలు సుందరంగా, గంభీరంగా అనిపించి ఒక సాంద్రతరమైన పవిత్ర భావాన్ని కలిగిస్తాయి. తస్వీర్ ఉర్దూ పదం. మిగతా అంతా సరళమైన హిందీ పదాలు 'రంగో ఛందోం ', 'సుందర్‌తా' వంటి  పదాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. ధఢ్కన్, జాన్, జీనా వంటి ఉర్దూ పదాలు ఎంతగా నిత్య జీవితంలో భాగమైపోయాయంటే అవి ఉర్దూ పదాలుగా అనిపించవు. ఆమె చిత్రపటం తయారు చేయాలని ప్రయత్నిస్తే ఆమె సౌందర్యం రంగుల్లో, ఊహల్లో ఒదగదు. హృదయ స్పందన ఆమె. జీవించేందుకు ప్రాణం ఆమె. పాటలో అర్ధం

పైపైకి మామూలుగా, సులభంగా అర్ధం అవుతూన్నా కళాకారుడికి ఆమెను ప్రేరణగా భావిస్తూ చరణాన్ని పరిశీలిస్తే అద్భుతంగా అనిపిస్తుంది. గతంలోనూ పలు సందర్భాలలో తామూహించిన రూపాన్ని చిత్రపటంలో బంధించేందుకు కళాకారులు పడే తపనను ప్రతిబింబించిన గీతాలున్నాయి.

**తస్వీర్ బనాతాహూ, తస్వీర్ నహీ బన్తీ**

**ఎక్ ఖ్వాబ్ స దేఖా థా , తాబీర్ నహీ బన్తీ**

'బారాదరి' సినిమాలో 'ఖుమార్ బారాబన్క్వి' రాసిన తలత్ మహమూద్ పాట ఇది. చిత్రపటం సృజిస్తున్నాడు. కానీ చిత్రపటం తయారు కావటంలేదు. ఎందుకంటే ఆయన ఒక కలన్నాడు. ఆ కలను రేఖల రూపంలోకి తర్జుమా చేయాలని ప్రయత్నిస్తూంటే ఆ కలను ప్రతిబింబించే నమూనా చిత్రపటం తయారవటంలేదు.

ఇలాంటి పాటలకు భిన్నంగా కళాకారుడి సృజన ఆవేశాన్ని, సృజనాత్మక తపనను అత్యద్భుతంగా ప్రదర్శిస్తుంది ఈ 'ఇందీవర్' గీతం. ఓ వైపు నాయిక అందాన్ని వర్ణిస్తూ, మరోవైపు ఆమె అందం తనకు ప్రేరణగా నిలవటాన్ని, ఆ ప్రేరణ ఆధారంగా సృజనాత్మక ఆవేశాన్ని కళా సృజనగా మలచేందుకు పడే తపనను వర్ణిస్తుందీ గీతం.

**ఎక్ థడ్ కన్ హై తూ దిల్ కే లియే**

**ఎక్ జాన్ హై తూ జీనే కే లియే...**

అతని సృజనకు ఆమెనే ప్రాణం. కళాకారుడికి కళా సృజనకే జీవితం. అందుకే ఆమె హృదయ స్పందన అయింది. జీవితానికి ప్రాణం అయింది.

**మధుబన్ కి సుగంధ్ హై సాసోం మే**

**బాహోంమే కమల్ కీ కోమలతా**

**కిరణోంక తేజ్ హై చెహరే పే**

**హిరణోంకి హై తుఝ్మే చంచలతా..**

నాయిక వర్ణన ఇది. చిత్రకారుడి ఇబ్బందిని మరింత స్పష్టంగా ప్రదర్శిస్తుంది ఈ చరణం.

జిత్‌నే భి మిలే రంగ్ వో సభ్ భర్ దియే రుఖ్‌మే

ఎక్ రంగ్ -ఎ -వఫా ఔర్ హై, లావూ మై కిధర్ సే

'తస్వీర్ బనాతాహు తెరీ ఖూన్ -ఎ - జిగర్' సే అనే మహమ్మద్ రఫీ పాడిన పాట ఇది. 'దీవానా' సినిమాలోది. శకీల్ బదాయుని  రాసిన పాట ఇది. ఎన్నెన్ని రంగులు సృష్టిలో ఉన్నాయో, అన్ని రంగులూ తెచ్చి ఆమె చిత్రపటంలో ఇమిడ్చాడు. కానీ నమ్మకం అనే రంగును ఎక్కడినుండి తేవాలో బోధపడటంలేదు. ఇదీ 'దీవానా'లో కళాకారుడి సందిగ్ధం. 'సఫర్' నాయకుడి సందిగ్ధం వేరే.

ఆమె శ్వాస పూలతోట పరిమళం. ఆమె బాహువులది కమలాల కోమలత్వం. ఆమె వదనంపై కిరణాల వెలుతురు నిండి ఉంది. లేళ్ల చంచలత్వం ఆమెది. ఇదంతా చిత్రంలోకి ఎలా తర్జుమా చేయగలడు?

**ఆంచల్ కె తెరే హై తార్ బహుత్**

**కోయి చాక్  జిగర్ సీ నే కేలియే**

ఆమె కొంగులోని దారపు పోగులు గాయపడిన హృదయాన్ని కలిపి కుట్టేన్ని ఉన్నాయి. అంటే, చెదిరిన హృదయాలకు  ఆమె సాంత్వన అన్నమాట. శోక తప్త హృదయాలకు శాంతినిస్తుంది ఆమె చేలాంచలం.

ఆమె చిత్రపటాన్ని గీయటం కఠిన సాధ్యం. అందువల్ల కలిగిన నిరాశనుంచి, వేదననుంచి ఆమె కొంగులోని దారపు పోగు ఉపశమనాన్నిస్తుంది. అంత శక్తివంతమైనది, శాంతిని కలిగించేది ఆమె. అందుకే ఆమె కళ్లు జీవితేచ్ఛను రగిలిస్తున్నాయి. ప్రేరణనిచ్చి కళాసృజనకు తోడ్పడుతున్నాయి.

ఈ పాదంలో కూడా పదాలు అత్యంత ఆనందాన్ని కలిగిస్తాయి. 'సుగంధ ', 'కమల్ కీ కోమలతా ', 'కిరణోంకా తేజ్ ' 'హిరణోంకి చంచలతా ', ఇలాంటి పదాలు పాటలో వ్యక్తపరచే భావానికి లోతైన గాంభీర్యాన్నిస్తాయి. పాటకొక పవిత్రతను ఆపాదిస్తాయి. పాట వింటూన్నా, పాడుతూన్నా మనసును ఆనందమనే నౌకలో అనంత శాంత ప్రశాంత నదిలో ప్రయాణం చేయిస్తాయి.

ఈ పాటలో హిందీ సాహిత్య సుగంధం ప్రతి పదంలో తొణికిసలాడుతూంటుంది. వర్ణనలన్నీ సాంప్రదాయిక వర్ణనలే. చివరలో 'చాక్ జిగర్ సీ నా' అన్నది పర్షియన్ సాహిత్య ప్రభావంతో చేసిన  వర్ణన. భారతీయ సాహిత్యంలో విషాదాంతాలు లేవు. అందుకే భగ్న హృదయం, పగిలిన హృదయాన్ని కుట్టుకోవటం వంటివి ఉండవు. విరహ వేదనలున్నాయి. ప్రియుడి తలపులో తపించటం ఉంది. కానీ జీవితాంతం కన్నీరు కారుస్తూ, హృదయానికయిన గాయాలను కుట్టుకుంటూ, ప్రేయసిని తలుస్తూ జీవితం గడపటం భారతీయ సాహిత్యంలో ఉండదు. ఎందుకంటే విషాద ప్రేమగాధలు  సాంప్రదాయ సాహిత్యంలో లేవు. ఎంతగా కఠినమైన పరిస్థితులు ఎదుర్కొన్నా, ఎన్ని అడ్డంకులు దాటినా, చివరలో ప్రేయసి, ప్రియులు కలుస్తారు. కాబట్టి 'చాక్ జిగర్' గాయపడిన హృదయాన్ని 'సీ నే కేలియే' కుట్టుకునే అవసరం కలగదు.

హిందీ సినిమా పాటలలో సాహిత్యాన్ని గమనించి, విశ్లేషిస్తే ఒక గేయ రచయితపై ఉన్న ప్రభావాలు తెలుస్తాయి. హిందీ సాహిత్య ప్రభావం అధికంగా ఉన్న గేయ రచయిత వర్ణనలకూ, ఉర్దూ సాహిత్య ప్రభావం ఉన్న రచయిత వర్ణనలకూ తేడా ఉంటుంది. తమపై ఉన్న ప్రభావాలను గేయాలలో ప్రతిబింబించటంద్వారా గేయ రచయితలు సామాన్యులకు ఊహలనిచ్చారు. ఆలోచనలిచ్చారు. వారి హృదయ స్పందనలకు రెక్కలనిచ్చారు. సమాజానికి సంస్కారాన్నిచ్చారు. సినీమాధ్యమంలో గేయ రచయితల ప్రాధాన్యం ఇది. ఈ బాధ్యతను అర్థం చేసుకున్న సినీ గేయ రచయితలు అత్యద్భుతమైన ఆలోచనలతో గేయాలు రచించారు. సినీ గీతాలకు సాహిత్య గంధం పూశారు.

కౌముది పాఠకులకు నూతన సంవత్సర ఆర్థిక, హార్దిక శుభాకాంక్షలు.

మరిన్ని మధురమైన పాటలతో వచ్చేనెల.

Click here to share your comments